RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 276 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 9 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-




## ఏడాదంతా మహర్దశే!

# రేవంతుడికి తిరుగే లేదు!!

## క్రోధి నామ సంవత్సరంలో ఆయన చరిష్మా ఎలా ఉండబోతుందో తెలుసా..?

హైదరాబాద్ :భ తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి తనదైన చరిష్మాతో పాలన అందిస్తున్నారు. గత సీఎం కేసీఆర్ పాలన పట్ల పూర్తిగా ప్రజల్లో ఒకరకమైన నెగెటివ్ భావం కల్గించేలా చేయడంలో రేవంత్ సక్సెస్ అయ్యారని చెప్పవచ్చు. ముఖ్యంగా రేవంత్ మంచి వాగ్ధాటి, ముక్కుసూటి తనకం కలవాడు. ఎంతటి కష్టాలు పెట్టిన, కేసులు పెట్టిన కూడా ధైర్యం విడువలేదు. ఇంటి బెడ్ రూమ్ ను పగలగొట్టి పోలీసులు లోపలికి ప్రవేశించిన కూడా ఆయన వెన్నుచూపలేదు. కూతురు పెళ్లివేడుకకు దూరంచేసిన కూడా ఆయన తనమనో బలాన్ని మాత్రం కోల్పోలేదు. అన్నింటికి తప్పనిసరిగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం మాత్రం పక్కాఅనే ధోరణిలో ముందుకు వెళ్లారు. ఆయన అన్నట్లుగానే.. తెలంగాణ ఎన్నికలలో మంచి మెజారిటీతో కాంగ్రెస్ ప్రభుత్వంను ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ కు గతంలో పలుమార్లు ఎమ్మెల్యేగా చేశారు. కానీ ఏనాడు మంత్రిగా చేసిన అనుభవం లేదు. పైగా ఆయనకన్న అనుభవం, సీనియారిటీ ఉన్న నేతలకు వరుసగా చెక్ పెడుతూ.. ఆయన సీఎం రేసులో ముందు వరుసలో నిలబడ్డారు. ఆయన మొండితనం, పబ్లిక్ స్పీచ్ లు ఇచ్చేటప్పుడు జనాన్ని ఉత్సాహపరిచే విధంగా ఆయన మాట్లాడే వారు. అదే విధంగా ఎవరు ఊహించని విధంగా రేవంత్ రెడ్డి, అనూహ్యంగా పెద్దల ఆశీస్సులతో సీఎం వరకు తన ప్రస్థానం కొనసాగించారు. ప్రస్తుతం క్రోధి నామసంవత్సరం సీఎం రేవంత్ రెడ్డికి ఎలా ఉండబోతుందని తెలుగు ప్రజలు ఆసక్తితో సెర్చ్ చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. నవంబరు నెల 8 న, 1969 లో మధ్యాహ్నం 2 గంటలకు జన్మించారు. ఆయనది తులరాశి, చిత్తా నక్షత్రంగా సమాచారం.

అయితే.. గత మాజీ సీఎం కేసీఆర్ రెండుసార్లు సీఎం కావడంతో ఒకరకమైన అహంకారపూరితంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. అపోసిషన్ నేతలను వేధించడం, ప్రజలను పట్టించుకోకపోవడం, మంత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రజలు విసిగెత్తిపోయారు. అదేసమయంలో రేవంత్ రాజకీయాల్లో ఒక్కసారిగా యాక్టివ్ గా మారిపోయారు. ఇక.. కేసీఆర్ ఎప్పుడైతే టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చారో.. అప్పటి నుంచి గులాబీ పార్టీ పతనం ప్రారంభమైందని చెప్పుకొవచ్చు. ప్రధాని పట్ల అగౌరవంగా ప్రవర్తించడంతో రాష్ట్రానికి అనేక విషయాల్లో కలిగిన నష్టాలను రేవంత్ ప్రజల్లోకి తీసుకెళ్లారు. దీంతో కేసీఆర్ ఒంటెద్దు పొకడలు, ప్రగతి భవన్ పాలనపట్ల విరక్తితో రగిలిపోయారు. వీటన్నింటిని సీఎం రేవంత్ మెట్లుగా పర్చుకుంటూ, అంచెలంచెలుగా సీఎం స్థాయి వరకు ఎదిగారు. పార్టీలోని సీనియర్లను కలుపుకుని పోవడం, కొందరితో మాట్లాడి, వ్యవహారాలు సద్దుమణిగేలా చేసుకొవడం లో రేవంత్ తన చతురత కనబర్చారు. గతంలో వైఎస్సార్ మాదిరిగా.. రేవంత్ ఢిల్లీ పెద్దల దగ్గర మంచి మార్కులు కొట్టేయడంలో సక్సెస్ అయ్యారు. తన గురించి నెగెటివ్ ప్రచారం బైటకు రాకుండా రేవంత్ ఎంతో అలర్ట్ గా ఉండేవారు. సీఎంగా ప్రమాణ స్వీకారంచేసేటప్పుడు.. ప్రగతి భవన్ గేట్లు కూల్చేయడం, ప్రజల నుంచి వినతులు స్వీకరించడం, ఆరుగ్యారంటీలు అమలు చేయడం, ఇటు తెలంగాణలోని అనేక శాఖలను సీఎం రేవంత్ సమూలంగా ప్రక్షాళన చేయడంలో సక్సెస్ అయ్యారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి ప్రజల ముందుంచారు. దీంతో అనేక మంది బీఆర్ఎస్ నేతలు.. ఆ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక తుక్కుగూడ జనజాతర సీఎం రేవంత్ కు మరో మైలురాయిగా చెప్పుకొవచ్చు. కాంగ్రెస్ హైకమాండ్ తరలివచ్చిన ఈ సభకు , జనాలు తండోపతండాలుగా వచ్చారు. అగ్రనాయకులంతా.. రేవంత్ ను ప్రత్యేకంగా అభినందించినట్లు సమాచారం. కాంగ్రెస్ హైకమాండ్ ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పూరించింది. ఇక మరో రెండు రోజుల్లో క్రోధి నామ సంవత్సరం రాబోతుంది. సీఎం జాతకం ప్రకారం.. ఆయనకు నూతన తెలుగు సంవత్సరంలో కూడా మహర్దశ పట్టనుందని పండితులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆయన ఎలాంటి అంతరాయంలేకుండా సీఎంగా ఆయన టెర్మ్ పరిపాలిస్తాడని కూడా పేర్కొన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఢిల్లీలో కూడా చక్రం తిప్పే అవకాశాలు లేకపోలేదని కూడా ఆయన జాతకం ప్రకారం తెలుస్తోందని జ్యోతిష్యులు వెల్లడిస్తున్నారు.

# కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్టు.. బీఆర్ఎస్ లోనూ!!


రాజకీయాలలో ఏ పార్టీ అయినా కొన్నిసార్లు అధికారంలో, కొన్నిసార్లు ప్రతిపక్షంలో ఉండక తప్పదు. అయితే అధికారంలో లేకపోతే పార్టీ శ్రేణులు అభద్రత భావానికి గురవుతాయి. అయితే అది కొంతవరకు మాత్రమే. కానీ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో మాత్రం వింత పరిస్థితి చోటు చేసుకుంది. కీలక నాయకులందరూ ఫిరాయింపులను ఆశ్రయిస్తున్నారు. పార్టీలో ఉ ండలేనంత బిఆర్ఎస్ శ్రేణుల అభద్రత భావానికి కారణాలేంటి? ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

అభద్రత భావానికి సవాలక్ష కారణాలు కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్టు బీఆర్ఎస్ శ్రేణులలో అభద్రత భావానికి సవాలక్ష కారణాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి అధికారంలో లేదు కాబట్టి ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తమను టార్గెట్ చేసి ఇబ్బంది పెడతాయి అనే భావన. ఈ భావనతో చాలామంది సేఫ్ జోన్ లోకి వెళ్లాలని పార్టీ మారుతున్నారు.



**అభద్రతా భావాన్ని పెంచిన కేసులు** : మరొక కారణం ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ టాపింగ్ కేసు, ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను అరెస్ట్ చేయడం వంటి సంఘటనలు బి ఆర్ ఎస్ శ్రేణుల అభద్రతాభావాన్ని మరింత పెంచాయి. ఈ కేసులలో అధినేత కుటుంబ ఇరుక్కుంటే తమ పరిస్థితి ఏమిటి? తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటి అన్నది? ఆలోచిస్తున్న చాలామంది కాంగ్రెస్ వైపు, బీజేపీ వైపు చూస్తున్నారు. అవకాశాన్ని బట్టి జంప్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి వార్నింగ్స్ తో టెన్షన్ ఇంకా మరో ముఖ్యమైన కారణం తెలంగాణ రాష్ట్రంలో సీఎం గా ఉన్న రేవంత్ రెడ్డి కెసిఆర్ ఫ్యామిలీని వదిలిపెట్టను అని పదే పదే చెప్పడం.. జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే, జైల్లో చిప్పకూడు తినాల్సిందే అని కెసిఆర్ ఫ్యామిలీకి హెచ్చరికలు జారీ చేస్తున్న తీరు బి ఆర్ ఎస్ శ్రేణులకు ఆందోళన కలిగిస్తుంది. కెసిఆర్ ను రేవంత్ రెడ్డి కచ్చితంగా వదిలిపెట్టడు అని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు, అన్ని బాగా ఉన్నప్పుడే సేఫ్ జోన్ లోకి వెళితే మంచిదని పార్టీ ఫిరాయిస్తున్నారు.

**అవకాశవాద రాజకీయం** : ఇక లోక్సభ ఎన్నికలు రావడంతో ఎన్నికల్లో అవకాశాల కోసం కొందరు, అధికార పార్టీలోకి వెళితే పదవులు వస్తాయని కొందరు, అవకాశవాద రాజకీయాల్లో భాగంగా పార్టీ మారుస్తున్నారు. అయితే గతంలో అధికారాన్ని కోల్పోయిన ఏ పార్టీలోనూ ఇంత ఎక్కువ అభద్రతాభావం లేదు. కానీ ప్రస్తుత పరిస్థితులు బీఆర్ఎస్ లో తీవ్ర ప్రకంపనలకు కారణమవుతున్నాయి.




# రెండో స్థానంలో నిలిచేదెవరు!?

## దిగజారిపోతున్న బిఆర్ఎస్ - ఎగబాకుతున్న బిజెపి!!

## పార్లమెంటు ఎన్నికలు కేసీయార్ కు పెద్ద పరీక్షా ?



హైదరాబాద్ : పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్ది పొలిటికల్ సర్కిళ్ళు, మేథావుల్లో ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదేమిటంటే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రెండోప్లేసులో ఏ పార్టీ ఉంటుంది ? అని. ఇక్కడ రెండోప్లేసు అని అంటున్నది ఎందుకంటే మొదటిప్లేసు ఆల్రెడి కాంగ్రెస్ పార్టీకి రిజర్వయిపోయిం ది కాబట్టి. ఎలా రిజర్వయ్యిం దంటే జాతీయ మీడియా, సర్వే సంస్ధలు కాంగ్రెస్ కు 10 సీట్లకు తక్కువకాకుం డా వస్తాయని జోస్యాలు చెబుతున్నాయి. మేథావులు, విశ్లేషకులు కూడా ఈ విషయాన్ని గట్టిగానే నమ్ము తున్నారు. దీనికి కారణం ఏమిటంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు నాలుగునెలలు మాత్రమే అ య్యింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన సిక్స్ గ్యారెంటీస్ హామీల్లో నాలుగింటిని ఈ నాలు గు నెలల్లో అమల్లోకి తెచ్చేసింది. మిగిలిన వాటికోసం అవస్తలు పడుతోంది. ఈ విషయాన్ని పక్కనపెట్టేస్తే జనాలకు డైరెక్టు కాంటాక్టు ఉండేలా ప్రజావాణి అనే కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి మొదలుపెట్టారు. వారానికి రెండుసార్లు ముఖ్యమంత్రి పబ్లిక్ ను కలిసి సమస్యలు విని పరిష్కారానికి పూనుకుంటున్నారు. ఈ విషయంలో రేవంత్ ను కేసీయార్ స్టైల్ ను జనాలు పోల్చి చూస్తున్నారు. అలాగే రేవంత్ పబ్లిక్ లో దూసుకుపోతున్నారు. రెగ్యులర్ గా సచివాలయంకు వస్తున్నారు. మంత్రులు, ఉన్నతాధికారులు, పార్టీ నేతలు, పబ్లిక్ ను కూడా ప్రతిరోజు కలుస్తున్నారు. ఇలాంటి చర్యలన్నీ వ్యక్తిగతంగా రేవంత్ తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ఇమేజిని పెంచాయి. ఇదే సమయంలో ప్రభుత్వంపైన ఎక్కడా నెగిటివ్ రాలేదు. నెగిటివ్ లేకపోవటం కూడా ప్లస్సే కదా. కాబట్టి జనాల్లో కాంగ్రెస్ విషయం లో సానుకూలత కనబడుతోంది. ఈ సానుకూలతే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు బాగా ప్లస్ అవుతుందని వివిధ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**కేసీయార్ గ్రాఫ్ పడిపోతోందా ?** ఇక బీఆర్ఎస్ విషయం తీసుకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కేసీయార్ కు వ్యక్తిగతంగానే కాకుండా పార్టీపరంగా చేదు అనుభవాలను మిగులుస్తోంది. కేసీయార్, పార్టీ గ్రాఫ్ దారుణంగా పడిపోతోంది. పార్టీని వదిలేస్తున్న నేతలు, పార్లమెం టు టికెట్లు ఇచ్చినా పోటీ చేయనని చెబుతున్న నేతలు, టికెట్ వద్దని పార్టీని వదిలేస్తున్న నేతల వైఖరే దీనికి నిదర్శనం. అధికారంలో ఉన్న పుడు బీఆర్ఎస్ ది బలపు అనుకున్న వాళ్ళకి అది బలుపు కాదు కేవ లం వాపు మాత్రమే అని అర్ధమవుతోంది. అందుకనే మొత్తం 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ మహాయితే ఓ రెండుమూడు సీట్లలో గెలిస్తే చాలా ఎక్కువనే చర్చ పెరిగిపోతోంది.

ఇదే సమయంలో బీజేపీ విషయం చూస్తే స్లో అండ్ స్టడీ పద్దతిలో వెళుతోంది. బీఆర్ఎస్ ను వదిలేస్తున్న నేతల్లో అత్యధికులు కాంగ్రెస్ లో చేరుతున్నా కొంత మంది బీజేపీలో చేరుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండటమే తెలంగాణాలో బీజేపీకి కలిసొస్తోంది. రాబోయే ఎన్నికల్లో పదిసీట్లలో గెలుపును బీజేపీ టార్గెట్ గా పెట్టుకున్నా అది సాధ్యంకాదని వాళ్ళకి కూడా తెలుసు. బీజేపీ టార్గెట్ ఏమిటంటే రెండోప్లేసులో ఉండటమే. బీజేపీ రెండోస్ధానంలో ఉండాలంటే బీఆర్ఎస్ ను మూడోప్లేసులోకి నెట్టేస్తే కాని సాధ్యంకాదు. ఇదే సమయంలో రెండోప్లేసు కోసం కేసీయార్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అంటే రెండోస్ధానం కోసమే ఇపుడు బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ జరుగుతోందని అర్ధమవుతోంది.

**బీజేపీకి 35 శాతం ఓట్లొస్తాయా ?** మొన్న జరిగిన అసెంబ్లీఎన్నికల్లో సుమారు 14 శాతం ఓట్ల షేరుతో బీజేపీ ఎనిమిది నియోజకవర్గాల్లో గెలిచింది. ఈ దామాషా ప్రకారం చూస్తే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 24 శాతం ఓట్లు రాబట్టుకోవాలి. ఈ నేపధ్యంలోనే నరేంద్రమోడి బీజేపీ నేతలతో మాట్లాడుతు పార్లమెంటు ఎన్నికల్లో పదిసీట్లు, 35 శాతం ఓట్లు సాధించాలని నిర్దేశించారు. మోడి నిర్దేశిస్తే ఓట్లు, సీట్లు వచ్చేస్తాయా ? రావు ఎందుకంటే లోకల్ లీడర్లలో జనాకర్షక నేతలు లేరు. తెలంగాణా నేతలను చూసికాకుండా మోడిని చూసి మాత్రమే జనాలు ఓట్లేయాలి.

అందుకనే మోడి చెప్పినట్లుగా 35 శాతం ఓట్లు రాకపోవచ్చు. అయితే బీజేపీకి ఓట్ల శాతం పెరిగేకొద్దీ బీఆర్ఎస్ ఓట్లకు గండిపడే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ 37.5 శాతం ఓట్లతో 39 అసెంబ్లీలను గెలుచుకున్నది. కాబట్టి బీజేపీకి పెరిగే ప్రతి శాతం ఓటు బీఆర్ఎస్ ను వెనక్కు నెట్టేయటం ఖాయం. అందుకనే రెండోప్లేసు కోసమే బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ ఉంటుందనేది. బీఆర్ఎస్ గనుక రెండోప్లేసులో నిలిస్తే పార్టీ కొంతకాలం మనగలుగుతుంది. అలాకాకుండా మూడోప్లేసులోకి పడిపోతే సమీపభవిష్యత్తులోనే ఉనికికోల్పోయే అవకాశాలు కనబడుతున్నాయి.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## రాజ్యాంగాన్ని మార్చటం పాపమైతే.. కాంగ్రెస్ సర్కారు ఎన్నిసార్లు చేసింది?

ఒక అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇక.. వాట్సాప్ యూనివర్సిటీ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. మోడీ ఆశిస్తున్నట్లుగా తాజా ఎన్నికల్లో 400 ఎంపీలను గెలిపించుకుంటే రాజ్యాంగాన్ని మార్చేస్తారని.. దాన్ని సవరిస్తారంటూ ఉదరగొట్టేస్తున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగానికి ఇప్పటివరకు ఎలాంటి సవరణ జరగలేదన్నట్లుగా.. ఎలాంటి మార్పులు చేయలేదన్నట్లుగా వారి ప్రచారం సాగుతోంది. మరి వాస్తవం ఏమిటన్నది చూస్తే.. 2018 నాటికి భారత రాజ్యాంగంలో 123 సార్లు సవరణ ప్రతిపాదనలు జరగ్గా.. 101 సార్లు చట్టాల్ని సవరణ చేశారు. మరి.. ఇన్నిసార్లు రాజ్యాంగాన్ని సవరణ చేసినప్పుడు లేని లొల్లి తాజాగా మోడీ అండ్ కో 400 సీట్లను సొంతం చేసుకుంటే వచ్చే ఇబ్బంది ఏమిటి? అన్నది ప్రశ్న. రాజ్యాంగానికి ఇప్పటివరకు జరిగిన 101 సవరణల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన సవరణలు అక్షరాల 62 సార్లు. దేశ తొలి ప్రధానమంత్రిగా పని చేసిన జవహర్ లాల్ నెహ్రూ హయాంలో 17సార్లు రాజ్యాంగానికి సవరణలు చేస్తే..ఆయన కుమార్తె ఇందిరాగాంధీ ఏకంగా 28 సార్లు సవరణ చేశారు. ఇందిరమ్మ కొడుకు రాజీవ్ గాంధీ దేశ ప్రధానిగా ఉన్న వేళలో 10సార్లు రాజ్యాంగ సవరణ చేయగా.. ఆయన సతీమణి సోనియా సారథ్యంలోని యూపీఏ సర్కారు తన పదేళ్ల ప్రభుత్వంలో ఏడు సార్లు రాజ్యాంగానికి సవరణ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇన్ని సార్లు రాజ్యాంగాన్ని సవరణలు చేసినప్పుడు.. మోడీ సర్కారు రాజ్యాంగాన్ని మార్పులు చేస్తే వచ్చే నష్టమేంటి. అది కూడా.. భారీ మెజార్టీ సాధించిన తర్వాత.. ప్రజల నుంచి తీర్పు వచ్చిన తర్వాత చేపడితే తప్పేముంది? రాజ్యాంగాన్ని మార్పులు చేస్తారంటూ ఆగమాగం చేసే వారంతా.. మోడీ ప్రధానమంత్రిగా ఉన్న పదేళ్ల కాలంలో దశాబ్దాల తరబడి దేశాన్ని పట్టి పీడిస్తున్న ఎన్నో కీలక వివాదాలను ఒక కొలిక్కి తీసుకురావటమే కాదు.. వాటికి ఫుల్ స్టాప్ పెట్టిన వైనాన్ని మర్చిపోకూడదు. ఏళ్లు ఏళ్లుగా సమస్యల్ని.. వివాదాల్ని సజీవంగా ఉంచేస్తూ.. ఎప్పటికి పరిష్కారాన్ని చూపని కాంగ్రెస్ ఇప్పుడున్న పరిస్థితుల్లో అవసరమా? అన్నది ప్రశ్న. మోడీ అండ్ కోకు 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారంటూ ఉదరగొడుతున్న విపక్షాల వల్ల ఒక మేలు ఉంటుందన్నది మర్చిపోకూడదు. అదేమంటే.. ఇంత ప్రచారం చేసిన తర్వాత కూడా దేశ ప్రజలు 400 సీట్లను ఇస్తే మాత్రం.. రాజ్యాంగానికి మోడీ ప్రభుత్వం చేసే మార్పుల విషయంలో ఇప్పుడు నోరు పారేసుకునే పార్టీలు... నేతలు ఎవరూ నోరు విప్పకూడదన్న విషయాన్ని మర్చిపోకూడదు. మరేం జరుగుతుందో చూడాలి.

# గనులు భగభగ.. కార్మికులు విలవిల



గోదావరిఖని: సాధారణ ఉష్ణోగ్రతలుంటేనే ఉపరితల గనుల్లో పనిచేయడం కష్టం. అలాంటిది రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. యంత్రాల వేడితో పాటు పైనుంచి భానుడి ప్రతాపం మరింత వేడిని పెంచుతోంది. సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపరితల గనుల్లో ప్రస్తుతం ఉద్యోగులు పనిచేయలేకపోతున్నారు. క్వారీల్లో పనిచేసే ఉద్యోగుల పరిస్థితి మరింత కష్టంగా ఉంది. ఆపరేటర్లు సైతం క్యాబిన్‌లలో కూర్చోలేకపోతున్నారు. ఉపరితల గని క్వారీల్లో పనిచేసే కేబుల్‌బాయ్‌లు, మజ్దూర్ కార్మికులు చెమటలు కక్కుతున్నారు. రామగుండం ప్రాంతంలోని నాలుగు ఉపరితల గనుల్లో 7 వేల మంది పనిచేస్తున్నారు. రామగుండంలోని ఓసీపీ-1, 2, 3, 5 ఉపరితల గనుల్లో ఉదయం, రెండో షిఫ్టులో పనిచేసే ఉద్యోగులు పనిచేయలేక ఇబ్బంది పడుతున్నారు. బయటి ఉష్ణోగ్రతల కంటే క్వారీల్లో నమోదయ్యే ఉష్ణోగ్రతలు మరో 4 డిగ్రీలు అదనంగా ఉంటుంది. శనివారం రామగుండం ప్రాంతంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో భారీ యంత్రాలు నడిచే ప్రాంతాలు ధూళితో నిండిపోతున్నాయి. దీంతో కార్మికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

### మార్చని పని వేళలు

ఎండ తీవ్రత కారణంగా పని వేళల్లో మార్పు చేయాలి. కానీ యాజమాన్యం ఇప్పటి వరకు ఉద్యోగుల పని వేళల్లో ఎలాంటి మార్పు చేయలేదు. సాధారణంగా ఉదయం షిఫ్టులో పనిచేసే ఉద్యోగులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు, రెండో షిఫ్టు ఉద్యోగులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు షిఫ్టు సమయాలుంటాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉదయం షిఫ్టు వేళలు ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. రెండో షిఫ్టు కార్మికులకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సమయాలు కేటాయించాలని విన్నవిస్తున్నారు.

### ఉపశమన చర్యలు అంతంత మాత్రమే

క్వారీల్లో చలువ పందిళ్లు వేయాల్సిన సంస్థ మొక్కుబడిగా పచ్చని తెరతో చిన్నపాటి పందిరి ఏర్పాటు చేసింది. దీంతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందే అవకాశం లేదు. వెదురు తడకలతో షెల్టర్లు నిర్మించి అందులో కూలర్‌లు ఏర్పాటు చేయడం ద్వారా పని మధ్యలో విశ్రాంతి తీసుకునే అవకాశం ఉంటుంది. అక్కడే చల్లని నీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచడం ద్వారా ఎండ తీవ్రతకు గురయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. క్వారీల్లో పనిచేసే ఉద్యోగులు ధూళి బారిన పడకుండా మాస్కులు సరఫరా చేయాలి. కానీ వాటిని కూడా కార్మికులకు అందజేయడం లేదు.

### పడిపోతున్న హాజరు శాతం

ఎండ తీవ్రతకు భయపడి ఉపరితల గనుల్లో పనిచేసే ఉద్యోగులు చాలా మంది విధులకు హాజరు కావడం లేదు. రెండో షిఫ్టు విధులు నిర్వహించే ఉద్యోగులకు సంబంధించి 20 శాతం హాజరు పడిపోయింది. ఉదయం షిఫ్టు ఉద్యోగులు 10 శాతం వరకు విధులకు హాజరు కావడం లేదు. కేవలం రాత్రి షిఫ్టు విధులు నిర్వహించే ఉద్యోగులు మాత్రమే విధులకు హాజరవుతున్నారు.

# ఉన్నత విద్యకు రవాణా భారం



ఇబ్రహీంపట్నం : ప్రాథమిక విద్యను సొంత గ్రామాల్లో పూర్తి చేసి ఉన్నత విద్యాభ్యాసం కోసం పక్క గ్రామాలకు వెళుతున్న విద్యార్థులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. ఉన్నత పాఠశాలలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామాల విద్యార్థులు, సమయానికి బస్సులు ఉండని గ్రామాల వారు, సరైన రవాణా సౌకర్యం లేని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో కొన్ని గ్రామాల్లో విద్యార్థులు కాలి నడకన వెళుతుండగా, మరికొన్ని గ్రామాల్లో సైకిళ్లపై, మరికొన్ని చోట్ల ఆర్థికంగా భారమైనప్పటికీ ప్రైవేట్ ఆటోల్లో వెళుతున్నారు. వేసవి ప్రారంభం కావడంతో విద్యార్థులు ఎండ వేడిమిని తట్టుకోలేక పోతున్నారు. నివాస ప్రాంతాల నుంచి కనీసం ఒక కి.మీ. నుంచి 5 కి.మీ కంటే ఎక్కువ దూరం నుంచి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం రవాణా భత్యాన్ని అందిస్తోంది. రవాణా భత్యం ప్రభుత్వం చెల్లించక పోవడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం తప్పడం లేదు.

### సమయానికి బస్సులు రాక..

ఆదర్శ పాఠశాలలో మండలంలోని 17 గ్రామాలతో పాటు పక్క మండలాల్లోని గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కొన్ని గ్రామాల్లోని విద్యార్థులకు బస్సు సౌకర్యం ఉండగా, పలు గ్రామాల విద్యార్థులకు సరైన సమయంలో బస్సు లేకపోవడంతో ప్రైవేట్ ఆటోల్లో పాఠశాలలకు వెళుతున్నారు. మండలంలోని ఇబ్రహీంపట్నం, తిమ్మాపూర్, వేములకుర్తి, ఎర్దండి, వర్షకొండ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు పక్క గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్తుంటారు. ప్రస్తుతం ఒంటి పూట బడులు కావడంతో పలు చోట్ల మధ్యాహ్నం బడి ముగిసిన తర్వాత బస్సు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

### దూరాభారమైనా..

మండలంలోని సంగెం, గుంలాపూర్, సర్వారాజ్‌పల్లె, ధర్మారం, తిమ్మయ్యపల్లె గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. ఎనిమిది నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు పక్క గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. కొంత మంది విద్యార్థులు సైకిల్‌పై వెళ్తుండగా మరికొంత మంది ఆటోలలో పాఠశాలకు వెళ్తున్నారు. సంగెం గ్రామ విద్యార్థులు నాగులపేట, గుంలాపూర్ వారు వెకంటాపూర్, సర్వారాజ్‌పల్లె వారు మాదాపూర్, ధర్మారం, తిమ్మయ్యపల్లె గ్రామాల విద్యార్థులు అయిలాపూర్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరభారమైనా నడుచుకుంటూ, సైకిళ్లపై పాఠశాలలకు వెళ్తున్నారు.

### గంట ముందు బయలుదేరాల్సిందే..

మండలంలోని నాగారం, కమలాపూర్ గ్రామాల విద్యార్థులు ధర్మపురికి రావడానికి ఎలాంటి రవాణా సదుపాయం లేక ఇక్కట్లకు గురవుతున్నారు. రహదారి బాగున్నా, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు రావడం లేదు. 3 కి.మీ. దూరంలో ఉన్న ధర్మపురికి చేరుకోవాలంటే కాలినడకన లేదా సైకిళ్లపై రావాల్సిందే. ధర్మపురిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలకు ఉదయం 9 గంటలకు వెళ్లాలంటే గంట ముందు ఇంటి నుంచి బయలు దేరాల్సి వస్తోంది. సుమారు వంద మంది విద్యార్థులు ఉండగా కొందరు తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలపై పంపిస్తుండగా మరికొందరు కాలినడకన వెళుతున్నారు. ఇటీవల ఫేస్‌బుక్ మిత్ర బృందం గ్రామానికి చెందిన కొందరు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ప్రైవేటు వాహనాల్లోనే..

మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ ప్రాథమిక పాఠశాలకు మూడు కి.మీ. దూరంలోని పాటిమీదితండా నుంచి సుమారు 40 మంది విద్యార్థులు వస్తుంటారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఆటోలో పాఠశాలకు వెళ్తున్నారు. ఇక్కడ ఉన్న పాఠశాలను గతంలో మూసేశారు. మెట్‌పల్లి మండలంలో 23 గ్రామాలకు 11 గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 1,116 మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా గ్రామాల నుంచి హైస్కూల్ విద్య కోసం కాలినడకన, ఆర్టీసీ బస్సు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది. ఏఎస్ఆర్ తండా నుంచి మెట్లచిట్టాపూర్ హైస్కూల్‌కు సుమారు 15 మంది వరకు విద్యార్థులు వెళ్తుండగా, తండా నుంచి కిలోమీటర్ దూరంలోని రంగారావుపేట బీటీ రహదారి వరకు కాలినడకన వెళ్లి అక్కడి నుంచి బస్సు లేదా, ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు.

### తిప్పలు తప్పేదెలా?

రాయికల్: మండలంలో 32 గ్రామాలు ఉండగా 12 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత పాఠశాలలో చదవడానికి పక్క గ్రామాలకు వెళ్లాల్సిందే. కట్కాపూర్, దావన్‌పల్లి, ఆల్యానాయక్ తండా గ్రామాల విద్యార్థులు తాట్లవాయికి సుమారు 6 కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తోంది. కుమ్మరిపల్లి విద్యార్థులు రాయికల్, సింగరావుపేట, కిష్టంపేట, కుర్మపల్లి, అయోధ్య, ఉప్పుమడుగు విద్యార్థులు అల్లీపూర్‌కు, రాజనగర్, వీరాపూర్ విద్యార్థులు రాయికల్, ఆలూరుకు సుమారు 5 కి.మీ.దూరం నిత్యం వాహనాలు, సైకిల్‌పై వెళ్తున్నారు. ఇటిక్యాల గ్రామానికి సుమారు 3 కి.మీ. దూరంలో గల ఆదర్శ పాఠశాలకు నిత్యం విద్యార్థులు నడిచి వెళ్లాలి.

# శనగ రైతులకు మంచి రోజులు

పెద్దశంకరంపేట: పప్పుల ఉత్పత్తి తగ్గిపోయి, వాటికి డిమాండ్ అధికం కావడంతో ధరలు పెరుగుదలకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం శనగలకు ఎక్కువ ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించేందుకు వీటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, బహిరంగ మార్కెట్‌లోనే అధికంగా రావడంతో కేంద్రాలకు తీసుకురావడం లేదు. మద్దతు ధర క్వింటాకు రూ.5,440 ఉండగా, వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పెద్దశంకరంపేట, శివ్వంపేట మండలాల్లో శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా, ఉత్పత్తుల విక్రయానికి రైతులు ముందుకు రావడంలేదు.

**పంట సాగు లేక..:** జిల్లాలో శనగ పంట సాగు ఏటా తగ్గుతూ వస్తోంది. దీంతో మంచి డిమాండ్ ఏర్పడుతోంది. గతంలో పంటలు సాగు చేసినా కేంద్రాల లేక బయట మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఉండేది. దీంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. సాధారణ సాగు యాసంగిలో 2,187 ఎకరాలు ఉండగా, ఈ సారి 280.25 ఎకరాలు మాత్రమే సాగయింది. రేగోడ్, శివ్వంపేట, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రామాయంపేట మండలాల పరిధిలోనే వీటిని సాగు చేశారు. ఎకరానికి సుమారు రూ.3 వేలు ఖర్చయితే 4 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. చేల వద్దకు వెళ్లి నాణ్యతను పట్టించుకోకుండా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు రవాణా ఖర్చు తప్పుతోంది. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను రెండు చోట్ల ప్రారంభించినా, రైతులు బయట మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారని మార్క్‌ఫెడ్ ఎగ్జిక్యూటివ్ తిరుపతి పేర్కొన్నారు.

# హామీలు ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా..

జిన్నారం: పరిశ్రమల స్థాపన.. ఉత్పత్తులు చేసే సమయంలో కార్మికుల సంక్షేమం, ఉత్పత్తుల నాణ్యత, ఉపాధి, ఆదాయం వంటి విషయాల్లో ప్రభుత్వ శాఖలకు యాజమాన్యాలు స్పష్టమైన హామీలిస్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్న పరిస్థితులు ఉన్నాయి. ఆచరణలో అవి ఎక్కడా కనిపించవు. ఫలితంగా కోవాలెంట్, ఎస్బీ ఆర్గానిక్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలే కారణమని ఆరోపణలు ఉన్నాయి. పారిశ్రామిక జిల్లాగా పేరున్న సంగారెడ్డి ప్రాంతంలో ప్రమాదాలపై చర్చ సాగుతున్న నేపథ్యంలో కథనం. పరిశ్రమల్లో విద్యుత్ షాక్ అని, ప్రమాదవశాత్తు, ఫ్లాష్ ఫైర్ అని చెబుతుంటారు. ఏది జరిగినా ఇక్కడ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ప్రతి పరిశ్రమకు సేఫ్టీ మేనేజర్, ప్రతి షిఫ్టునకు భద్రతా విభాగం ప్రత్యేక పర్యవేక్షకుడు ఉంటారు. ఓ స్థాయి పరిశ్రమల్లో ఇలా ఉన్నా చిన్నవాటిల్లో కానరాదు. రియాక్టర్‌లో రెండు వేర్వేరు రసాయనాలు కలిపినప్పుడు ఒత్తిడి పెరుగుతుంది. ఆ సమయంలో ఏం చేయాలో నిపుణులు, కెమిస్ట్‌లకు తెలుసు. కానీ దీనిపైపర్యవేక్షణ లేకుండానే కొన్ని యూనిట్లలో చేస్తారు. దీంతో ఒక్కసారిగా వేడి పెరిగి భారీ పేలుడు సంభవించి ప్రాణనష్టం జరుగుతుంది. వేసవిలో సహజంగా వేడి పెరుగుతుంది. అందుకు అనుగుణంగా చల్లదనం ఇవ్వాలి. లేకుంటే ప్రమాదమే. ఎస్బీ ఆర్గానిక్ లో రియాక్టర్ వద్ద థర్మవెల్ లీక్ అయినట్లు గుర్తించినా కట్టడి చేసి



నివారించడంలో విఫలమైనట్లు పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి. ముందస్తు చర్యలు చేపట్టినట్టయితే ప్రాణ, ఆస్తి నష్టం ఉండేది కాదంటున్నారు.

### భద్రతా పరికరాలు ఏవీ..

రసాయన పరిశ్రమల్లో ఫోమ్, ఇసుక వంటివి పని చేసే కార్మికుల సంఖ్యకు ఆధారంగా నిల్వ చేసుకోవాలి. ప్రతి మూలకు పైపులైన్ ఉండాలి. అగ్నిమాపక వాహనం చుట్టూ తిరిగేలా రోడ్డు ఉండాలి. కానీ ఇవి ఎక్కడా కానరావు. సమస్యను కర్మాగారాల భద్రతా శాఖ, అగ్నిమాపక శాఖ గుర్తించినా తాఖీదులు ఇచ్చి సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో అంతర్జాతీయంగా వస్తున్న ఆధునిక పరికరాలను సమకూర్చుకోవాలి. ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో వాటి జోలికి వెళ్లరు.

### అనుమతి లేనివి ఉత్పత్తి చేస్తే..

కొన్ని పరిశ్రమలు అనుమతి లేని ఉత్పత్తులు చేస్తారు. ఇదే సమయంలో ఎవరికీ పూర్తిగా అవగాహన ఉండదు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియదు. శిక్షణ కూడా ఇవ్వరు. పైగా రియాక్టర్లు పేలే ప్రమాదం ఉంటుంది. ఏటా జాతీయ భద్రతా వారోత్సవాల పేరిట అధికారులు హంగామా చేస్తారు. కానీ ప్రతి కార్మికుడిని అందులో భాగస్వామ్యం మాత్రం చేయరు. అయితే ఆడిట్ సమయంలో పెద్ద పరిశ్రమలు, విదేశీ సంస్థలు వచ్చినపుడు తాత్కాలిక ఏర్పాటు చేసి తమ ఉత్పత్తులకు ఆర్డర్లు తెచ్చుకునే వారు కనిపిస్తారు.

### క్రైసిస్ కమిటీ సమీక్షల మాటేమిటి?

జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజానాయకులు, స్వచ్ఛంద సంస్థలు కొందరు ఎంపిక చేయబడిన మీడియా ప్రతినిధులతో ప్రతి జిల్లాలో లోకల్ క్రైసిస్ కమిటీ ఏర్పాటవుతుంది. ప్రతి ఏటా ఒకటికి రెండు సార్లు సమీక్షలు చేయాలి. భద్రతా లోపాలు గుర్తించాలి. పలు తీర్మానాలు చేసి కార్మికుల రక్షణకు సూచనలివ్వాలి. కొన్నేళ్లుగా కమిటీ ఉన్నా సమీక్షలు చేయడం లేదని విమర్శలున్నాయి.

# బోధనపై లేదు దృష్టి.. వ్యాపారాలతో ఆస్తుల సృష్టి

ఆదిలాబాద్ : ఒకప్పుడు ఉపాధ్యాయ వృత్తి చేపడితే 'బతకలేక బడి పంతులు' అనేవారు. ఇప్పుడు కొంత మంది ఉపాధ్యాయుల నిర్వాకంతో 'బతక నేర్చిన బడి పంతులు' అనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా నీటి వ్యాపారం చేస్తూ అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లి వచ్చిన ఓ ఉపాధ్యాయుడిని డీఈవో ప్రణీత సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో బోధనా వృత్తిని పక్కనపెట్టి ఇతర వ్యాపారాలు, వ్యాపకాలు చేస్తున్న ఉపాధ్యాయుల తీరు చర్చనీయాంశమవుతోంది.

సమాజం బాగుండాలంటే ఉపాధ్యాయులదే కీలకపాత్ర. అంతటి కీలకస్థానంలో ఉన్న కొంతమంది దారితప్పుతున్నారు. అసలు తమ వృత్తికి న్యాయం చేయకుండా జిల్లాలో చాలామంది ఉపాధ్యాయులు స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. మరికొందరు చీటీల దందా నడిపిస్తుండగా, కొందరు వడ్డీ వ్యాపారులయ్యారు. ఇంకొందరు హొటళ్లు, దుకాణాలు, నీటి వ్యాపారంతో సొంత వ్యాపకాలు చేసుకుంటున్నారు. ఇంకొందరు కుటుంబీకుల పేర జీవిత బీమా ఏజెంట్లుగా మారారు. కార్పొరేట్ సంస్థల్లో ప్రవేశాల ఇప్పించే దళారులుగా తయారయ్యారు. ఇందులో మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఇతర వ్యాపకాల్లో ఎక్కువగా కనిపిస్తున్నారు. కిందటేడాది జరిగిన ప్రభుత్వ స్థలాల వేలంలో అత్యధికులు ఉపాధ్యాయులే పాల్గొన్నారంటే భూ దందాపై వారికి ఏమేరకు ఆసక్తి ఉందో ఇట్టే అర్థమవుతోంది. జిల్లాలో విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టు నిమిత్తం కిందటి విద్యాసంవత్సరం 41 మంది దరఖాస్తు చేసుకోగా.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 13 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఆయా వ్యాపారాలు చేస్తున్న వారు సామాజిక మాధ్యమాల ద్వారా వాటిని ప్రచారం చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది. తాజాగా ఓ ఉపాధ్యాయుడి సస్పెన్షన్ ఉదంతంలోనూ ఇతర ఉపాధ్యాయ సంఘాలు ఫిర్యాదు చేస్తేగానీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

### గాడితప్పిన వ్యవస్థ

డీఈవో మొదలుకొని, ఎంఈవోలు, కాంప్లెక్సు హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించే అధికారం ఉంది. ఉపాధ్యాయుల సమయపాలన, వారి బోధన తీరు, విద్యార్థుల సామర్థ్యాలను పర్యవేక్షించాల్సింది పోయి వంతుల వారీగా విధులు నిర్వహించే వారి నుంచి నెలవారీగా వసూళ్లు చేయడం, సందర్శన పేరిట సొంత వ్యాపకాల్లో నిమగ్నమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా విద్యా వ్యవస్థ గాడితప్పుతోంది. విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయాల్సిన గురువులు ఇతర వ్యాపకాలతో సంపాదనకు ఎగబడటం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన పాలనాధికారి రాజర్షిషా విద్య, వైద్య రంగంపైనే దృష్టి సారిస్తానని చెప్పడంతో.. విధులకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులను దారికి తీసుకురావాలని జిల్లావాసులు కోరుతున్నారు.

### సీసీఏ నిబంధనలు ఏం చెబుతున్నాయంటే?

క్లాసిఫికేషన్ కంట్రోల్ అండ్ అప్పీల్(సీసీఏ) నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోధన మినహా ఇతర ఏ వ్యాపకాలు చేయరాదు. ప్రభుత్వం ఏ ఆదేశం ఇచ్చినా 24 గంటలు అందుబాటులో ఉండాలి. ఎక్కడ వృత్తి నిర్వహిస్తారో అక్కడే నివాసముండాలి. హెడ్‌క్వార్టర్ వదిలితే ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి.

# ధాన్యం శుద్ధి ఎలా?

భువనగిరి : వరిధాన్యం శుభ్రం చేసేందుకు సరిపడా ప్యాడీ క్లీనర్లు లేవు. పాతవి నడవడం లేదు. ప్రభుత్వం కొత్తవి ఇవ్వడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో దాదాపు ఇదే దుస్థితి నెలకొంది. కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు నాణ్యతా ప్రమాణాలను నిర్దేశించింది. వాటి ప్రకారం ధాన్యం శుభ్రం చేసేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. యంత్రాలు లేక ప్రైవేట్‌వి అద్దెకు తెచ్చుకుని ఆర్థిక భారం మోయాల్సి వస్తోంది. గతంలో ఎప్పుడో ప్రభుత్వం సమకూర్చిన పాత యంత్రాలు మూలకు పడ్డాయి. పైగా కూలీలతో శుభ్రం చేయాల్సి వస్తుంది.

తీవ్ర ఇబ్బందులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు ఇచ్చిన అంచనాల మేరకు జిల్లా యంత్రాంగం కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. పౌరసఫరాల సంస్థ పర్యవేక్షణలో ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీవోలు గ్రామాల్లో పీపీసీలు తెరిచి కొనుగోళ్లు చేస్తున్న విషయం విధితమే. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆయా జిల్లాల కొనుగోళ్లకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కొనుగోళు ్లకు కావాల్సిన తూకం యంత్రాలు, ప్యాడీక్లీనర్లు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు తదితరాలను సమకూర్చాల్సి ఉంది. ప్రధానంగా ప్యాడీ క్లీనర్లకు కొరత ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 910 కొనుగోలు కేంద్రాలు తెరవాలని ప్రతిపాదించారు. కనీసం ఒక్కో కేంద్రానికి ఒకటి చొప్పునైనా ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు ఉండాలి. కానీ 889



యంత్రాలు మాత్రమే ఉన్నాయి. సూర్యాపేటలో మాత్రం 236 కేంద్రాలకు గాను 246 యంత్రాలు ఉండగా.. నల్గొండలో 370కి 355 మాత్రమే ఉన్నాయి. భువనగిరి జిల్లా ఇంకా తక్కువగా 314 కేంద్రాలకు 288 మాత్రమే ఉన్నాయి.

పాత యంత్రాలతో కనీసం ఆరుగురు కూలీలతో ధాన్యం శుభ్రం చేస్తున్నారు. గంటకు 20 క్వింటాళ్ల వరకు మాత్రమే సాధ్యమవుతుంది. పాత వాటి స్థానంలో నూతన సాంకేతికతతో రూపొందించిన యంత్రాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. కొత్త వాటితో రైతు ఒక్క కూలీతో గంట సమయంలో 35 నుంచి 40 క్వింటాళ్లు శుభ్రం చేయవచ్చునని ఆత్మకూర్ (ఎం) కేంద్రం నిర్వాహుడు సత్యనారాయణ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

కొనుగోలుకు ఆదేశించాం:

బెన్ షాలోమ్, అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా

కొత్తవి కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించాం. 50 ప్యాడీక్లీనర్ల కొనుగోలుకు లేఖ రాశారు.


ఆత్మకూర్(ఎం)లో మూలకుపడ్డ ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు

# శత్రుదుర్భేద్యంలో పేలిన తూటా..!

చర్ల : అదో శత్రుదుర్భేద్యం.. కాకులు దూరని కారడవి... ఆకాశన్నంటేలా ఎత్తైన కొండల ప్రాంతం.. అడుగడుగునా మందుపాతరలు ఉండే ప్రాంతం. అలాంటి చోట ఊహించని విధంగా 'తూటా' పేలింది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని డోలీగుట్టల్లో తెల్లవారుజామున భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు.

టీసీ, ఓసీ సమయంలో..

ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మావోయిస్టులు తమ కార్యకలాపాలకు పదును పెడుతుంటారు. టీసీ-ఓసీ (టాక్టికల్ కౌంటర్ అఫెన్స్ క్యాంపెయిన్) నిర్వహిస్తారు. ప్రధానంగా శత్రువును ఓడించేలా దాడులు విస్తృతం చేస్తారు. ఈక్రమంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల ఎదురుకాల్పులు చోటుచేసుకుంటాయి. మెరుపు వేగంతో దూసుకొస్తున్న శత్రువును ఎదురుదెబ్బ కొట్టేలా వ్యూహాలు పన్నుతున్న మావోయిస్టులకు ప్రస్తుత ఘటనలు అంతర్మథనంలో పడేసేలా ఉన్నాయి. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో మార్చి 19న జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. కొద్దిరోజుల్లోనే మార్చి 27న బీజాపూర్ జిల్లా చీపురుభట్టి అటవీప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారు. వారం వ్యవధిలోనే తిరిగి ఇదే జిల్లాలోని కోర్చేలి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో




ఏకంగా 13 మందిని మావోయిస్టు పార్టీ కోల్పోయింది.

పక్కా సమాచారంతోనే డోలీ గుట్టల దుర్భేద్యంలోకి భద్రతా బలగాలు అతి కష్టమ్మీద చేరుకున్నట్లుగా తెలుస్తోంది. సముద్ర మట్టానికి దాదాపు 750 అడుగుల పైగా ఎత్తులో ఉన్న ఈ గుట్టల్లోకి చేరుకోవటం అషామాషీ కాదు. అలాంటి ఎత్తైన కొండలపైకి ఎవరూ రారనే మితిమీరిన ఆత్మవిశ్వాసం మావోయిస్టులను దెబ్బతీసినట్లుగా తెలుస్తోంది. ఈఘటనలతో సరిహద్దు ప్రాంతాల ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతుతోంది.

ఆజాద్ లేఖతో.. డోలీగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, మావోయిస్టు పార్టీ బీకేఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ ఆక్షేపించారు. ఈ ఘటనకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పూర్తి బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఈ ఎన్‌కౌంటర్‌కు నెత్తుటి బాకీ తీర్చుకుంటామని చేసిన తీవ్ర హెచ్చరికతో రాజకీయ నాయకుల్లో సైతం ఆందోళన మొదలైనట్లు తెలుస్తోంది.

# ఇక ఆడొచ్చు.. సమావేశం కావొచ్చు



తాండూరు: జిల్లాలో అతిపెద్ద పట్టణంగా పేరున్న తాండూరులోని క్రీడాకారులు ఆటలు ఆడేందుకు, అధికారులు సమావేశాలు నిర్వహించేందుకు సంబంధించిన ఇండోర్ స్టేడియం, ఆడిటోరియం నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయి. మరికొద్ది రోజుల్లోనే అందుబాటులోకి రాగానే అధికారులు కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

ప్రైవేటు వేదికలే ఆధారం

అధికారులు నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా తాండూరులో ఆడిటోరియం లేదు. వివిధ శాఖలకు చెందిన సిబ్బంది, ఉన్నతాధికారులు ఒకేసారి సమావేశం కావాలంటే ప్రైవేటు వేడుక వేదికలే దిక్కవుతున్నాయి. ఇందుకోసం రూ.వేలల్లో అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే 2022లో ప్రభుత్వం పట్టణ శివారులోని అంతారం గుట్టపై ప్రత్యేకంగా ఆడిటోరియం నిర్మించడానికి ఎకరం స్థలాన్ని కేటాయించి రూ.2కోట్లను మంజూరు చేసింది. ఆడిటోరియంలో ఒకేసారి 1000 మంది సమావేశమయ్యేలా భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. విశాలమైన హాలు, ప్రత్యేక వేదిక, రెండు పెద్దపాటి గదులు, మహిళలు, పురుషులకు గౌరవ గృహాలు, తాగునీటి వసతి వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని పంచాయతీ రాజ్‌శాఖకు బాధ్యతలను అప్పగించింది. గుత్తేదారు మధ్యలోనే పనులను ఆపేసి వెళ్లి పోయారు. మిగిలిన పనులను వేరొక గుత్తేదారుకు అప్పగించారు. ప్రస్తుతం రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. మరో 20 రోజుల్లో మొత్తం పూర్తి కాగానే అందుబాటులోకి రానుంది.

2016లో ఆర్డీఓ కార్యాలయంగా మార్పుతాండూరులో క్రీడాకారుల కోసం 2001లో రూ.50 లక్షల వ్యయంతో 3 ఎకరాల్లో నిర్మించిన మినీస్టేడియం 2016లో ఆర్డీవో కార్యాలయంగా మారింది. క్రీడాకారులు ఆటలు ఆడేందుకు ప్రత్యేక స్టేడియం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 2022లో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా ఇండోర్ స్టేడియం నిర్మించడానికి పట్టణ శివారు అంతారం గ్రామ పరిధిలో 1.5 ఎకరాల భూమిని కేటాయించి రూ.2కోట్లను మంజూరు చేసింది. పనుల పర్యవేక్షణ బాధ్యతలను విద్యామౌలిక వసతుల శాఖకు అప్పగించింది. స్టేడియంలో టేబుల్ టెన్నిస్, క్యారమ్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలు ఆడేందుకు అనుకూలంగా ఉండేలా చూడాలని సూచించింది. ఆమేరకు గుత్తేదారు పనులను ప్రారంభించారు. రూ.కోటి వరకు పనులు చేసినా బిల్లులు రాలేదు. దీంతో ఏడాది కిందటే సగంలో పనులు ఆగిపోయాయి. రెండు నెలల కిందటే పాత బిల్లులు గుత్తేదారుకు అందాయి. అయితే మిగిలిన పనులను ప్రారంభించలేదు. అధికారులు రూ.కోటి విలువ చేసే పనులను వేరొక గుత్తేదారుకు అప్పగించడంతో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. 15 నుంచి 20 రోజుల్లో ఇండోర్ స్టేడియం అందుబాటులోకి రానుందని విద్యామౌలిక వసతుల శాఖ సహాయ ఇంజినీరు శ్రీనివాస్ తెలిపారు. ఇండోర్ స్టేడియంను త్వరలోనే అందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెప్పారు.

# పురాతన బావులు పునరుద్ధరించి.. రూ. కోట్లు ఆదా చేస్తూ..



హైదరాబాద్: నీళ్లు అందుబాటులో ఉన్నప్పుడు సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. లేనప్పుడు అవస్థలు పడటం ప్రజలతో పాటు ప్రభుత్వ విభాగాలకూ వర్తిస్తుంది. నగరంలో అడుగంటిన భూగర్భ జలాలే ఇందుకు నిదర్శనం. వానాకాలం ఆరంభానికి ముందే జలసంరక్షణపై దృష్టి సారించాల్సిన సంబంధిత విభాగాలు.. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించాయి. దీంతో ఇప్పుడు 80 శాతం బోర్లు ఎండిపోయాయి. జలమండలి సరఫరా చేస్తున్న నీరు సరిపోక నగరవాసులు అవస్థలు పడుతున్నారు. అయితే, దక్షిణమధ్య రైల్వే పరిధిలోని బోర్లే కాదు.. పురాతన ఊటబావులు కూడా జలకళతో ఉట్టిపడుతున్నాయి. రైల్వే భవనాలపైనా, ఖాళీస్థలాల్లో పడిన వాననీటిని ఒడిసిపట్టేందుకు ఎక్కడికక్కడ తీసిన ఇంకుడుగుంతలు సత్ఫలితాలనిస్తున్నాయి.

నిత్యం 4.70 లక్షల నీటి వినియోగం..

మౌలాలి జోనల్ శిక్షణ సంస్థ ప్రాంగణంలోని మెట్లబావి.. సాలార్‌జంగ్-1 మీర్ తురబ్ అలీఖాన్(1829-1883) కాలం నాటిది. తొలుత ఈతకొలనుగా ఉపయోగించేవారు. తర్వాత ఆ నీటితో స్థానికులు వ్యవసాయం చేశారు. స్వాతంత్ర్యానంతరం 1966లో రైల్వే పరిధిలోకి వచ్చింది. దాదాపు 5 దశాబ్దాలపాటు స్టీమ్‌ఇంజిన్ల నీటి అవసరాలు తీర్చేది. పునరుద్ధరణతో లక్ష లీటర్ల నీటిని రోజూ వినియోగించుకునే అవకాశం కలిగింది. ఆర్‌పీఎఫ్ శిక్షణ కేంద్రంలోని మెట్లబావినీ పునరుద్ధరించి నిత్యం 1.50 లక్షల లీటర్లు, మౌలాలిలోని మరో బావిని బాగుచేసి 50 వేల లీటర్లు, సికింద్రాబాద్‌లోని అలుగడ్డ బావిని పునరుద్ధరించి 1.70 లక్షల లీటర్ల నీటిని వినియోగించుకుంటోంది. 4 బావుల పునరుద్ధరణ ద్వారా.. మొత్తం 4.70 లక్షల లీటర్ల నీటిని నిత్యం వినియోగించుకుంటూ రూ. కోట్లు పొదుపు చేస్తోంది.

నీరు ఇంకని నిజాం కాలం నాటి బావులు


జలసంరక్షణలో ద.మ. రైల్వే అన్ని సర్కారు విభాగాలకు ఆదర్శంగా నిలుస్తోంది. మౌలాలిలోని జోనల్ శిక్షణ సంస్థలో నిజాం కాలం నాటి(200 ఏళ్ల) బావిని పునరుద్ధరించిన తీరును ప్రధాని మోదీ గతంలోనే ప్రశంసించారు. భూగర్భజలాలు తగ్గిపోకుండా.. జోనల్ శిక్షణ కేంద్రంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ (వాననీటి ఇంకుడు గుంతలు) చేపట్టిన తీరును ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇలా పురాతన ఊటబావులను పునర్వినియోగంలోకి తెచ్చి... రైల్వే పరిధిలోని పలు విభాగాలకు నీటికొరత తీరుస్తూ ఏటా రూ. 3 కోట్లు ఆదా చేస్తోంది. సికింద్రాబాద్ స్టేషన్ ప్రాంగణంలో వాడిన నీటిని రీసైక్లింగ్ చేసి మళ్లీ వినియోగంలోకి తెచ్చిన ఘనతా ద.మ. రైల్వేకుంది.. హైదరాబాద్, కాచిగూడల్లోనూ ఈ ప్లాంట్ల ఏర్పాటుతో నీటి వినియోగంలో గణనీయమైన పొదుపు పాటిస్తున్నారు.

# అడిగినప్పుడు కొనలేకపోయినం.. ఇప్పుడేమో కొనలేకున్నాం

హైదరాబాద్ : బంగారం.. పేద.. మధ్యతరగతి బేధం లేకుండా కుటుంబాలతో పెనవేసుకున్న బంధం. రేపటి అవసరాలకు.. ఇప్పటి అలంకారానికి ఉపయోగపడుతుందనే ఆలోచనతో పైసాపైసా కూడబెట్టి మరీ పసిడి కొనుగోలు చేస్తుంటారు. పండగలు.. వివాహ శుభకార్యాల సమయంలో దీనికి ఫుల్ డిమాండ్. కుటుంబ సభ్యులు కొనాలని అనుకున్నపుడు కాస్త తగ్గాక చూద్దామని వాయిదా వేశాం. ఇప్పుడేమో ఆకాశాన్నంటిన ధరలు చూసి కొనే సాహసం చేయలేకపోతున్నామంటున్నారు మహిళలు. కొద్దిరోజులు పెరుగుతూ వచ్చిన స్వర్ణం.. తాజాగా రికార్డు స్థాయికి చేరింది.

తులం ధర రూ.73150.. పసిడి ధర పరుగులు పెడుతోంది. రోజుకో జీవనకాల గరిష్ఠ స్థాయికి చేరుతోంది. నాలుగైదు రోజుల్లోనే ఏకంగా మూడువేలకుపైగా ధర పెరిగింది. శనివారం 10 గ్రాముల 24 క్యారట్‌ల పుత్తడి ధర నగరంలో రూ.73150 పలికింది. ఈ పరుగు ఇంకెక్కడి దాకా వెళుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

కొత్త ఆకృతులతో.. ఆభరణాలను ఎక్కువగా 22 క్యారట్ బంగారంతో చేస్తుంటారు. ధరలు అందనంత ఎత్తుకు చేరడంలో ఆభరణాల తయారీదారులు వ్యూహం మార్చారు. 18, 16 క్యారట్లతో అధునాతన డిజైన్లను రూపొందిస్తున్నారు. వీటిని సైతం భరించలేనివారు ఒక గ్రాము బంగారం కొనుగోలు చేస్తున్నారు. అధికాదాయ వర్గాలు వజ్రాభరణాలకే మొగ్గుచూపుతున్నారు. 'సంక్రాంతి సమయంలో 10 తులాలు బంగారు ఆభరణాలు కొనేందుకు సిద్ధమయ్యాం.. ధర తగ్గుందని ఆగాం.. ఇప్పుడేమో అసలు కొనగలమా అనిపిస్తోంది. వాయిదా వేసి తప్పుచేశామని బాధేస్తుందని' గృహిణి నీరజ తెలిపారు.



వెండి ఆభరణాలు కొంటున్నారు: పెనుమర్తి హేమదుర్గ, బాచుపల్లి

కరోనా విపత్తుకు ముందు వరకు 10 గ్రాముల బంగారం ధర రూ.40 వేల వరకు ఉండేది. ఆ తర్వాత మూడేళ్లలోనే అది రూ.70 వేలకు ఎగబాకింది. ఈ స్థాయిలో ధరలు పెరుగుతూ ఉంటే నచ్చిన మోడల్స్ కొన లేమోమో అన్పిస్తుంది. చాలామంది ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి వారికి నచ్చిన డిజైన్స్ కొనాలనుకుంటారు. ఆడవాళ్లకు ఆభరణాలే అందం. తరాలు మారుతున్నా కట్టుకునే దుస్తులు, వేసుకునే ఆభరణాలపై మాత్రం ఏ మాత్రం ఆసక్తి తగ్గ లేదు. మూడేళ్ల కాలంలో పెరిగిన ధరలతో బంగారు ఆభరణాలు కొనలేనివారు వెండి ఆభరణాల వైపు కొంటున్నారు.

# కొలతలు తీస్తూ.. లెక్కలేస్తూ

కామారెడ్డి :ఏళ్ల నుంచి ఇంటికి ఒకే రకమైన పన్ను చెల్లిస్తున్నారా..? పురపాలక యంత్రాంగాన్ని బురిడీ కొట్టించి పన్ను ఎగవేస్తున్నారా..? అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారా..? అయితే ఆగండి.. ఇక నుంచి పన్ను సక్రమంగా చెల్లించాల్సిందే అంటున్నారు అధికారులు. పురపాలక సిబ్బంది మీ ముంగిట్లోకి వాలి కొలతలు తీసి.. లెక్కలు వేసి నూతన పన్ను విధానాన్ని ఖరారు చేయనున్నారు.

ఆస్తి పన్ను పెంపులో భాగంగా కామారెడ్డి పురపాలక పరిధిలో కొలతలను సవరించాలని నిర్ణయించారు. కొన్నేళ్ల క్రితం బిల్‌కలెక్టర్లు తీసుకున్న కొలతలకు అదనంగా కొత్తవి తోడయ్యాయి. కింద ఒక అంతస్తు ఉండగా నూతనంగా నిర్మాణాలు చేపట్టారు. ఏళ్ల నుంచి మొత్తం నిర్మాణాలు పన్ను పరిధిలోకి రాక బల్దియా ఆదాయం కోల్పోతోంది. ఇటీవల ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అధికారులకు తగిన సూచనలందించారు. ఆదాయ రాబడికి చర్యలు తీసుకోవాలని



ఆదేశించారు. దీంతో యంత్రాంగం ఏప్రిల్ 1 నుంచి క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వేను ప్రారంభించింది.

ఇదీ పరిస్థితి మున్సిపాలిటీకి రూ.6.80 కోట్ల ఆదాయం ఆస్తి పన్నుల రూపేణ సమకూరుతోంది. 49 వార్డుల్లో 22,135 నిర్మాణాలు ఉన్నాయి. అందులో నివాస, నివాసేతర, వాణిజ్య గృహాలు పన్ను పరిధిలో ఉన్నాయి. అనేక నిర్మాణాలు వాణిజ్య అవసరాలకు వాడుతున్నా గృహ కేటగిరీ కింద ఉండి పన్ను తక్కువగా వస్తుంది. దీంతో పురపాలికకు నష్టం వాటిల్లుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు పన్నుల సవరణ చేపట్టేందుకు సిబ్బంది వార్డుల్లో పర్యటిస్తున్నారు.

రోజుకు 50 గృహాలు

కామారెడ్డిలో వార్డుకు 50 గృహాల చొప్పున సిబ్బంది కొలతలు తీయాలని పురపాలక అధికారులు బిల్‌కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. అసలే వేసవి కాలం. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సిబ్బంది వార్డుల్లో పర్యటించడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఏప్రిల్ నెలలో ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీని రాబట్టాలి. ఆ తర్వాత ఏయే నిర్మాణం ఏ విధంగా ఉందో భువన్ సర్వే ద్వారా సరిచూడాలి. ఆ తర్వాత ప్రక్రియ చేపడితే సత్ఫలితాలను ఆశించే వీలుంది. ఈ విషయమై కమిషనర్ సుజాతను వివరణ కోరగా కొలతలు తీయడానికి వచ్చేవారికి ప్రజలు సహకరించాలన్నారు. బల్దియా ఆదాయ రాబడికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు.

జిల్లాకేంద్రంలో వివరాలిలా..

నిర్మాణాలు 22135
నివాస 17345
నివాసేతర 3312
వాణిజ్య 1478

# పుస్తక రూపం.. ఓటరు చైతన్యం

మెదక్: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో అర్హులైన వారు ఓటు హక్కును వినియోగించుకుంటూ స్ఫూర్తిని చాటుతున్నారు. దేశంలోని ఆయా ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం ఉండేలా పార్లమెంట్ సభ్యుడి ఎన్నిక ప్రక్రియ ఇటీవల షురూ అయింది. ఈ మేరకు షెడ్యూల్ వెలువడగా, త్వరలో నోటిఫికేషన్ రానుంది. కీలకమైన ఈ ఎన్నిక ప్రక్రియలో తప్పులు జరగకుండా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం తలమునకలైంది. ఇప్పటికే ఈ క్రతువులో భాగమైన కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో ఓటరు కీలకం కావడంతో, ఓటరుగా నమోదు నుంచి మొదలుకొని.. ఓటు వేసే విధానం...పోలింగ్ ప్రక్రియ...ఓటు వేసేందుకు అవసరమైన పత్రాలు...సిబ్బంది చేయాల్సినవి... చేయకూడనవి వంటి వాటిపై అవగాహనతో పాటు చైతన్యం తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. శిక్షణ సమావేశాల్లో వివరించడమే కాకుండా... గోడపత్రికలు, కరపత్రాలు, పుస్తక రూపంలో ముద్రించి ప్రచారం చేస్తున్నారు.

కేంద్రాల్లో గోడపత్రికలు..

ఓటు వేసే విధానం, పోలింగ్ కేంద్రంలో గుర్తింపునకు ఉపయోగపడే పత్రాలు, పోలింగ్ సిబ్బంది చేయవలసినవి, చేయకూడనివి గురించి గోడపత్రికలను ముద్రించారు. వీటిని ప్రతి పోలింగ్ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. ఓటు వేసేందుకు అవసరమయ్యే పత్రాల గురించి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద ప్రదర్శిస్తున్నారు. శారీరక వైకల్యంతో బాధపడుతున్న ఓటర్ల అవసరాలు విస్తారంగా ఉంటాయి. వీరు పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వస్తే, వారి విషయంలో ఏ విధంగా వ్యవహరించాలి, ఒక వేళ వారు అడిగితే ఓటింగ్ ప్రక్రియను వివరించాల్సి ఉంటుంది. చెవిటి, వినికిడి, దృష్టి లోపంతో, వైకల్యం ఉన్న వారితో పోలింగ్ సిబ్బంది ఏ విధంగా వ్యవహరించాలనేది అంశాలపె గోడపత్రికను ముద్రించారు. ఇవన్నీ కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రూపొందించారు. ఇక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటు నమోదుపై బలగం సినిమా హీరో ప్రియదర్శి చిత్రంతో కూడిన కరపత్రికను ముద్రించారు. ఒక వైపు ఓటరు ఏ విధంగా నమోదు చేసుకోవాలని.. మరో వైపు 2024 క్యాలెండర్‌ను ముద్రించారు. ఓటు వేసేందుకు అవసరమైన గుర్తింపు పత్రాల గోడపత్రికను లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

'ఓటరు గైడ్'

ఓటు ద్వారానే అభ్యర్థి ప్రజాప్రతినిధిగా ఎన్నికవుతారు. అటువంటి ఓటర్లకు ఎన్నికల ప్రకియకు సంబంధించి పూర్తి వివరాలు తెలియజేసేలా కేంద్ర ఎన్నికలసంఘం ఈసారి 'ఓటరు గైడ్' అనే చిన్న పుస్తకాన్ని(బుక్‌లెట్) ముద్రించింది. ఇందులో ఓటరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, పోలింగ్ రోజున, పోలింగ్ ప్రక్రియ, ఓటు వేసే విధానం, ఎన్నికల సంఘం యాప్ సదుపాయాలు, చేపట్టే కనీస సౌకర్యాలు, ఓటర్ల ప్రతిజ్ఞ అంశాలను ఇందులో పొందుపర్చారు. వీటిని బూత్ స్థాయి అధికారులు(బీఎల్వో) ఇంటింటికి వెళ్లి అందజేస్తున్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు, ఏఏ తేదీల్లో కొత్తగా ఓటరు నమోదయ్యే వివరాలు, పోలింగ్ ప్రక్రియ ఏ విధంగా ఉంటుందనేది చిత్రాలతో కూడిన వివరాలున్నాయి. సీ-విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్, నో యువర్ క్యాండిడేట్ యాప్‌ల గురించి వివరించారు. ప్రతి ఓటరుకు ఈ బుక్‌లెట్ ఉపయోగపడనుంది.



# ప్రగతినగర్‌లో దారుణం.. యువకుడిని చంపి ఇన్‌స్టాలో సెల్ఫీ వీడియో

నిజాంపేట: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ప్రగతినగర్‌లో జరిగింది. ఎస్ఆర్ నగర్‌లోని దాసారం బస్తీకి చెందిన తేజస్ (21) అలియాస్ సిద్ధూ.. గత ఏడాది స్థానికంగా జరిగిన ఓ హత్య కేసులో ఏ3 నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి రెండు నెలల క్రితం విడుదలయ్యాడు. ప్రస్తుతం ప్రగతినగర్‌లోని అద్దె ఇంట్లో తన తల్లితో కలిసి నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి సిద్ధూ తల్లి ఊరు వెళ్లింది.

దీంతో ఒంటరిగా ఉన్న తేజస్.. తన మిత్రులైన మహేశ్, శివప్ప, సమీర్‌తో కలిసి మద్యం తాగాడు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్ ఎదురుగా నిలబడి ఉండగా.. గతంలో హత్యకు గురైన తరుణ్ స్నేహితులు సుమారు 20 మంది ద్విచక్రవాహనాలపై వచ్చి తేజస్‌ను కత్తులతో పొడిచి చంపారు. హత్య తర్వాత నిందితులు సెల్ఫీ వీడియో ద్వారా చిత్రీకరించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

తరుణ్ హత్యకు ప్రతీకారంగా తమ పగ నెరవేర్చుకున్నామంటూ నిందితులు ఆ పోస్టులో పేర్కొనడం గమనార్హం. ఘటనాస్థలిని కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాసరావు, బాచుపల్లి సీఐ జె.ఉపేందర్‌యాదవ్ పరిశీలించారు. ఘటనకు బాధ్యులుగా భావిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



# ఫోన్ ట్యాపింగ్ సెంటర్ల గుట్టు రట్టు!

## పోలీసుల దర్యాప్తు వేగవంతం.. ఎన్నిచోట్ల ట్యాపింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారంటే?

హైదరాబాద్, ఏప్రిల్ 8: ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతం అయ్యింది. నల్లగొండ, హైదరాబాద్‌లలో రెండు చోట్ల ఫోన్ ట్యాపింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. వరంగల్ దగ్గర పర్వతగిరి, సిరిసిల్ల, ఖమ్మంలో ఒక్కో చోట ట్యాపింగ్ సెంటర్ల ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు మొత్తం 7 ఫోన్ ట్యాపింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఖాకీలు కనుకొగన్నారు. నల్లగొండ విటీ కాలనీలో నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల మానిటరింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేశారు. అలాగే ఖమ్మం జిల్లా కోసం నేలకొండపల్లి మామిడి తోటలోని గెస్ట్ హౌజ్‌లో ట్యాపింగ్ సెంటర్‌ను పెట్టారు. హైదరాబాద్ ఎస్ఐబీ ఆఫీస్‌తో పాటు జుబ్లీహిల్స్‌లోనూ ట్యాపింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు.

వరంగల్, సిరిసిల్ల లో సైతం ట్యాపింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశారని పోలీసులు గుర్తించారు. కానిస్టేబుల్ నుంచి డీసీపీ స్థాయి వరకు ట్యాపింగ్‌ను అడ్డం పెట్టుకుని సెటిల్మెంట్లు, బెదిరింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నేతల కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు బయటపడింది. ఈ కేసుకు సంబంధించి పోలీస్ అదుపులో నలుగురు కానిస్టేబుల్స్ ఉన్నారు. అలాగే పలువురు నేతలకు నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**మహిళలను కూడా వదల్లేదు...** మరోవైపు విపక్ష నేతల కదలికలను గుర్తించడం వంటివే కాదు.. ఈ ఫోన్ ట్యాపింగ్‌తో మహిళలను కూడా పోలీసులు వేధించారని అధికారుల విచారణలో తేలింది. ఈ క్రమంలోనే నల్లగొండ జిల్లాకి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు అరెస్ట్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 40 మంది మహిళలను లైంగికంగా వేధించారు. ట్యాపింగ్‌లో ఓ కానిస్టేబుల్ నిర్వాకం అధికారుల విచారణతో వెలుగులోకి వచ్చింది. కొందరి డేటా సేకరించి వ్యక్తిగత జీవితాలను కూడా సదరు కానిస్టేబుళ్లు టార్గెట్ చేశారట. నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారట. మిల్లర్లు, స్మగ్లర్లు, పేకాట నిర్వాహకుల నుంచి ఓ కానిస్టేబుల్ భారీ వసూళ్లకు పాల్పడ్డాడు. రౌడీ షీటర్లతో చేతులు కలిపి ఓ పోలీస్ అధికారి సెటిల్‌మెంట్లు చేయడం జరిగింది. మునుగోడు ఉప ఎన్నిక సమయంలోనూ విపక్ష నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేశారు. ఆ తరువాత ఎమ్మెల్యే కొనుగోళ్ల కేసు వ్యవహారాన్ని సైతం తెలుసుకున్నది ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ద్వారానే అని పోలీసుల విచారణలో తేలింది.

ఎమ్మెల్యే కొనుగోళ్ల వ్యవహారాన్ని ముందే తెలుసుకుని పోలీస్ ఉన్నతాధికారి స్టీఫెన్ రవీంద్ర ద్వారా వ్యవహారం మొత్తం నడిపించారట. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన గుట్టంతా టాస్క్ ఫోర్స్ అధికారి రాధాకిషన్ రావు విప్పుతున్నారు. ఉన్నతాధికారి చెప్పినట్లే చేశానని విచారణలో తెలిపారు. ఈ వ్యవహారంలో అప్పటి అధికార పార్టీ నాయకుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది.

# సీఎం రేవంత్ కాన్వాయ్‌లో.. ఒక్కసారిగా పేలిన కారు టైర్!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో పర్యటించబోతున్నారు. హైదరాబాద్ నుంచి కొడంగల్ వెళ్తుండగా మార్గమధ్యలో సీఎం కాన్వాయ్‌లోని ఓ కారు టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పినట్లయ్యింది. మరోవైపు.. సీఎం భద్రతా సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే ఆ టైరును రిపేరు చేయడానికి స్థానికంగా ఉన్న మెకానిక్‌ను సిబ్బంది పిలిపించారు. ఈ ఘటన జరిగాక ఈ ఒక్క కారు తప్ప మిగిలిన వాహనాలతో రేవంత్ కొడంగల్‌కు చేరుకున్నారు. కొద్దిసేపటి క్రితమే కొడంగల్ పట్టణంలోని తన నివాసానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు.

**టార్గెట్ గెలుపు! :** మండలాలవారీగా కాంగ్రెస్ నాయకులతో సీఎం సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమీక్షకు వివిధ మండలాల సమన్వయ కమిటీ నాయకులు హాజరయ్యారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో కూడా సీఎం సమీక్ష నిర్వహించబోతున్నారు.

లోక్ సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని రేవంత్ దిశానిర్దేశం చేయనున్నారు. ఇదిలా ఉంటే.. మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్ని స్వామి వారికి సీఎం పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194





# ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు షాక్..

ఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్‌పై ఉత్కంఠ వీడింది. నేడు కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును వెలువరించింది. సీబీఐ స్పెషల్ కోర్ట్ జడ్జి కావేరి భవేజా కవితకు బెయిల్ నిరాకరిస్తూ తీర్పును వెలువరించారు. ఏప్రిల్ 4న కవిత బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పీఎంఎల్‌ఏ సెక్షన్ 45 ప్రకారం.. మహిళగా, ఎమ్మెల్సీగా ఉన్నందున.. ముఖ్యంగా తన చిన్న కుమారుడుకి 11వ తరగతి పరీక్షలు ఉన్నందున ఏప్రిల్ 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత కోరారు. ఈ మధ్యంతర బెయిల్‌ను ఈడీ వ్యతిరేకించింది. అయితే "కవిత చిన్నకొడుకు ఒంటరిగా ఏం లేడు. 22 ఏళ్ల సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు తోడుగా ఉన్నాడు. కవితను ఆమె ముగ్గురు సిస్టర్స్ ములాఖత్ అయ్యారు. అబ్బాయి చూసుకోవాడానికి కుటుంబ సభ్యులు ఉన్నారు. పరీక్షలు ఉన్నాయని మధ్యంతర బెయిల్ అడుగుతున్నారు, కానీ పరీక్షల్లో కొన్ని ఇప్పటికే అయిపోయాయి. కవిత కుమారుడికి ఎగ్జామ్ యాంగ్జైటీ ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదు" అని ఈడీ తరపు న్యాయవాది తెలిపారు. "కవితకు వ్యతిరేకంగా ఆధారాలు ఉన్నాయి. లిక్కర్ కేసు ప్లాన్ చేసింది కవిత. కవిత మొబైల్ ఫోన్లను మార్చారు. ఆధారాలు ధ్వంసం చేశారు. ఫోన్లలో సమాచారాన్ని డిలీట్ చేశారు. 9 ఫోన్లలో డేటా డిలీట్ చేశారు. మొత్తం 10 ఫోన్లను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపాం. 9 ఫోన్లను ఫార్మాట్ చేశారు. లిక్కర్ కేసులో కవిత పాత్రపై దర్యాప్తు కొనసాగుతుంది. కవిత బ్యాంకు ఖాతాలు, ఐటీఆర్ వివరాలు,కుటుంబ వ్యాపార వివరాలు ఇవ్వలేదు. ఫోరెన్సిక్ లాబ్ డేటా ప్రకారం 4 ఫోన్లు ఫార్మాట్ చేయబడ్డాయి. ఈ కేసులో వందల కొద్దీ డిజిటల్ పరికరాల్లో డేటా డిలీట్ చేయబడింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉంది.. ఈ సమయంలో కవితకు బెయిల్ ఇవ్వడం కేసు దర్యాప్తుకు ఆటంకం కలుగుతుంది. లిక్కర్ వ్యాపారంలో కవిత వాటా 33 శాతం. మాగుంట రాఘవరెడ్డి వాటా 33 శాతం. దినేష్ అరోరా అప్రూవర్ మారాకా అన్ని విషయాలు చెప్పాడు. వంద కోట్ల రూపాయలు కవిత ఆలోచన మేరకే ఆమ్ ఆద్మీ పార్టీకి ముడుపుల రూపంలో ఇచ్చారు. బుచ్చిబాబు ఫోన్ నుంచి డేటా రికవరీ చేశాము. ఆ డేటా ఆధారంగా కవితను విచారించాము. అరుణ్ పిళ్ళైతో కవితను విచారించాము. అప్రూవల్‌గా మారిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ కవిత బెదిరించారు" అని న్యాయవాది జోయబ్ హుస్సేన్ వెల్లడించారు. కవితకు వ్యతిరేకంగా సేకరించిన ఆధారాలను జడ్జికి సమర్పించారు. అలాగే కవితకు బెయిల్ ఇవ్వాలన్న వాదనను తిరస్కరించాలని కోర్టును ఈడీ తరపు న్యాయవాది జోయబ్ హుస్సేన్ కోరారు. ఈడీ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం కవితకు బెయిల్‌ను నిరాకరించింది.

# వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కోసం కేసీఆర్ కసరత్తు



హైదరాబాద్: వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కోసం పార్టీ అధినేత కేసీఆర్ కసరత్తు నిర్వహిస్తున్నారు. తొలుత వరంగల్ ఎంపి టికెట్‌ను కడియం కావ్యకు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఆమె కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుని.. ఆ పార్టీ తరుపున వరంగల్ నుంచి పోటీ చేస్తున్నారు. కడియం కావ్య పార్టీ మారడంతో మరో అభ్యర్థి కోసం బీఆర్ఎస్ పార్టీ తర్జన భర్జన పడుతోంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నేతల అభిప్రాయాలను కేసీఆర్ తీసుకుంటున్నారు. అధిష్టానం పరిశీలనలో డాక్టర్ పుల్లా శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ పేర్లున్నాయి. కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పుల్లా శ్రీనివాస్ పనిచేస్తున్నారు. డాక్టర్ సుధీర్ వచ్చేసి ప్రస్తుతం హన్మకొండ జడ్పీ చైర్మన్‌గా ఉన్నాడు. ఉద్యమ కాలం నుంచి సుధీర్ పార్టీలోనే కొనసాగుతున్నారు. పుల్లా శ్రీనివాస్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాస్యం వినయ్ భాస్కర్ సపోర్ట్ చేస్తున్నారు. అధినేత ఆదేశాలతో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నియోజక వర్గాల ఇన్‌చార్జిలు ఈ రోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వరంగల్ ఇన్‌చార్జిలతో పల్లా రాజేశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహిస్తున్నారు. సమావేశం అనంతరం పార్టీ అధినేత కేసీఆర్‌కు నేతలు నివేదిక ఇవ్వనున్నారు. ఈ నివేదిక ఆధారంగా రేపు వరంగల్ అభ్యర్థిని కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉంది.

# వాళ్లు చేసి.. మమ్మల్ని అంటున్నారు.. నీటి కొరతపై మంత్రి పొంగులేటి ఫైర్

ఖమ్మం జిల్లా, ఏప్రిల్ 8: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ మే ధ్యేయంగా పనిచేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం వైరా నియోజకవర్గ కేంద్రంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్నదని.. ఆ పరిస్థితుల్లో నీటిని మొత్తం వేస్ట్‌గా దిగువ ప్రాంతాలకు వదిలారన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే నీటి కొరత ఏర్పడిందని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతులను రెచ్చగొట్టేందుకు సానుభూతి పొందేందుకు కేసీఆర్ నటిస్తున్నారని.. రైతాంగం అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సాగర్ జలాలతో ఈ ప్రాంత చెరువులు, కుంటలను నింపి త్రాగునీటి ఇబ్బందులను తొలగిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాల పరిపాలనలో రాష్ట్రం తీవ్రంగా దెబ్బ తిన్నదన్నారు. బీఆర్ఎస్ నాయకులు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు ప్రయత్నాలు



మొదలుపెట్టారని.. ఇది ఎప్పటికీ జరగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పేదల పక్షపాతి అని.. వారి సంక్షేమం కోసం ఎన్ని విధాలైనా కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడుతుందని వెల్లడించారు. వేసవికాలంలో వర్షాలు పడటం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుపిస్తున్నారన్నారు. వర్షాలు అనేవి ఎన్నికల కంటే ముందే వచ్చాయని.. వచ్చిన నీటిని ఆ ప్రభుత్వమే నదులు పాలు చేసిందని మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# పొద్దుతిరుగుడు పంటను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి: హరీశ రావు

హైదరాబాద్: పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర కల్పించి, ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కనీస మద్దతు ధర అయిన రూ.6,760 చెల్లించి పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేయాలన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చిన మేరకే కొనుగోలు చేసి, రాష్ట్ర ప్రభుత్వం తరుపున కొనుగోలు చేయాల్సిన వాటా గురించి మౌనంగా ఉండడం రైతులను అవమానించడమే అవుతుందని చెప్పారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. 'తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల్లోని 20,829 ఎకరాల్లో ఈసారి రైతులు పొద్దు తిరుగుడు పువ్వు పంట పండించారు. ఈ పంటకు మార్కెట్లో కనీస మద్దతు ధర లభించడం లేదని నేను ఈ ఏడాది ఫిబ్రవరి 22న ప్రభుత్వానికి లేఖ రాశాను. దానికి స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావు మద్దతు ధర అయిన రూ.6,760 చెల్లించి పొద్దు తిరుగుడు పువ్వు పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దాని ప్రకారమే మార్కెట్లలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. అయితే రైతుల నుంచి వచ్చిన మొత్తం దిగుబడిని కొనుగోలు చేయకుండా, కేవలం కేంద్ర ప్రభుత్వం తన వాటాగా సేకరించాలనుకున్న మేరకే కొనుగోలు చేశారు. మిగతా పంటను ప్రస్తుతం కొనుగోలు చేయడం లేదు. దీంతో 75 శాతం పంటను రైతులు చాలా తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తున్నది. రాష్ట్రంలో 1,65,800 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు పంట దిగుబడి వస్తుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన నిధులతో కేవలం 37,300 క్వింటాళ్లు మాత్రమే కొనడానికి అంగీకరించింది. మార్కెట్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో, వారు నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం మాత్రమే సేకరణ జరిపారు. మొత్తం పంటలో కేవలం 25 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. మిగతా 75 శాతం పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లూ రైతులు పండించిన చివరి గింజ వరకు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు తెరిచి, పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసిన విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను. ఈ సారి కూడా రైతులు పండించిన చివరి గింజ వరకు కనీస మద్దతు ధర అయిన రూ.6,760 చెల్లించి పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చిన మేరకే కొనుగోలు చేసి, రాష్ట్ర ప్రభుత్వం తరుఫున కొనుగోలు చేయాల్సిన వాటా గురించి మౌనంగా ఉండడం రైతులను అవమానిండమే అవుతుందని మీ దృష్టికి తెస్తున్నాను. ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు కేవలం నాలుగైదు వేలకే తమ పంట అమ్ముకుని నష్టపోవాల్సి వస్తున్నది. మీరే స్వయంగా జోక్యం చేసుకుని పొద్దు తిరుగుడు పువ్వు పంటను మొత్తం కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి, రైతులు ఆదుకోవాలని కోరుతున్నాను.' అని లేఖలో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ అరెస్ట్

హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే పోలీసులు జడ్జి నివాసంలో హాజరుపరిచారు. ఈనెల 22 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో రహేల్‌ను చెంచల గూడా జైలుకు తరలించారు. గతేడాది ప్రజాభవన్ వద్ద జరిగిన ప్రమాదంలో రాహిల్ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. యాక్సిడెంట్ అనంతరం దుబాయ్ పారిపోవడంతో పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు. దుబాయ్ నుంచి తిరిగి ఇండియాకు వస్తుంటే పోలీసులు ఎయిర్‌పోర్టులో అదుపులో తీసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 23న అర్ధరాత్రి రాహిల్ మద్యం సేవించి అతివేగంగా కారు నడుపుతూ బేగంపేటలోని ప్రజాభవన్ వద్ద ట్రాఫిక్ డివైడర్లను ఢీకొట్టాడు. ఆ సమయంలో కారులో ముగ్గురు స్నేహితులు ఉన్నారు. తప్పతాగి యాక్సిడెంట్ చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఆ తర్వాత రాహిల్ తన తండ్రి షకీల్‌తో కలిసి దుబాయ్ పారిపోయాడు. ఈ కేసు నుంచి రాహిల్‌ను తప్పించడానికి మహారాష్ట్రకు చెందిన అబ్దుల్ ఆసిఫ్ అనే వ్యక్తిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు పంపి కేసు నమోదు చేయించారు. అయితే ఈ కేసులో రాహిల్‌ను తప్పించేందుకు అప్పటి పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు సహకరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఆయన వద్ద స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలో లభించిన కాల్‌డేటా ఆధారంగా షకీల్, నిజామాబాద్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, మరో ఇద్దరితో మాట్లాడినట్లు ఆధారాలు లభించాయి. దీంతో కేసును తారుమారు చేసేందుకు సీఐలు దుర్గారావు, ప్రేమ్‌కుమార్ జోక్యం చేసుకున్నారని గుర్తించారు. వారిద్దరిని సస్పెండ్ చేయటంతోపాటు అరెస్టు చేసి విచారించారు. మ్పెత్తంగా ఈ కేసులో 8 మంది అనుమానితులను అరెస్టు చేశారు. విచారణ కొనసాగుతోంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660